# 'అదిరాందే కదలను'

కలకంఠి పీటలేసింది. కంచాలు పెట్టింది. మంచినీళ్ళు అమర్చింది

ఆమె తల్లి ఇందువదన భోజనం వడ్డించటానికి సిద్ధమవుతూ అంది "మీ ఆయనేడే! ..... ఇందాకననగా పిలవమని చెప్పాను పిలిచావా?... ఇప్పటికే ఆలస్యమయిందో ఏంటో, కొత్తల్లుడు కూడాను?"

"చెప్పానే, మళ్ళీ వెళ్ళొస్తానాగు" - కలకంఠి దొడ్లో ఉన్న గొడ్లపాకదగ్గరికెళ్ళింది. తిరిగొచ్చింది. విచారంగా అంది. "ఇప్పుడు రార్ట కాస్సేపాగాల్ట?"

"కాస్సేపా, ఎందుకు?"..."ఏమో,.....అది రావాల్ట."

"అదా, అదంటే?"..." ఏమో"

ఇందువదన తికమకపడుతూ భర్తవంక చూసింది.

పీటమీద కూర్చునున్న జరరానలం కూతురువైపు చూసాడు. అన్నాడు. "అదా! అదంటే?... అవునూ పొద్దున్నేగా శుభ్రంగా కాలకృత్యాలు తీర్చుకున్నాడూ!... పోనీ, అదంటే ఆకలనా? ఆకలెయ్యటం లేదనా?"

"ఏమో నాన్నా, ఆకలేయకపోవటం మాత్రం కాదు." .. "అతను సరిగ్గా ఏవన్నాడో ఆముక్కలు చెప్పు!"... "అయనన్నది ఒకే ఒక ముక్క, ఒకే ఒకసారి! "అది రావాలి. అదొస్తేనే గాని భోంచెయ్యను? అని... "మీ ఆయనపినతల్లి పెత్తల్లి కూతుళ్ళెవరైనా వస్తార్టా?" - ఇందువదన అడిగింది.

"అస్సలు వాళ్లవైపెవ్వరూ ఆడపిల్లల్లేరు." - కలకంఠి అంది. జరరానలం మొహంలో అయోమయం తొంగి చూసింది. అతను పీట మీంచి లేచాడు. అటూ ఇటూ పచార్లు చేసాడు. కలకంఠి తమ్ముళ్ళిద్దరూ, చిన్నవాళ్ళు కంచాలు జరుపుకుంటూ వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు ఎక్కిరించుకుంటున్నారు. ఇందువదన ఒంటికాలిమీద వంటింటి అడ్డగోడకి ఆనుకుని, గడ్డం మీద చెయ్యేసుకుని, నడుముకు చెయ్యి మోపు పెట్టి, నిశ్చలంగా చూస్తూ ఉండిపోయింది. కలకంఠి సావిడి గుమ్మంమీద వేలికి కొంగు చుట్టుకుంటూ విప్పుకుంటూ కూర్చోనుంది.

పది నిముషాలు గడిచాయి.

ఇందువదన లోపలికి తప్పుకుని వంట పదార్థాల మీద, మూతలు పెట్టొచ్చింది. ఉండుంది మెరిసే కళ్ళతో చటుక్కున అంది "ఆఁ. ఈ విషయం చెప్పవే. యల్.టి.సి మీద గదా నెలబట్టీ తిరిగొస్తున్నారు మీకు ఈ యాత్రలో ఎవత్తె అయినా మీకు పరిచయమైందా?"

కలకంఠి నాలుగైదు క్షణాలాలోచించింది నెమ్మదిగా అంది "లేదే!... ఆంధ్రాలో కొచ్చాక మాత్రం నా ఫ్రెండు శాలినిని చూట్టానికి కంకిపాడెళ్ళాం, అంతే!"

"ఆఁ అయితే ఆ అమ్మాయిగాని వస్తానన్నదేమో!"

కలకంఠి నవ్వింది "ఎట్లావస్తుందమ్మా, మేమక్కడుండగానే అమెరికా వెళ్ళటానికి టాక్సీ ఎక్కి

గన్నవరం వెళ్ళిపోతేనూ!''

''ఊ(.... అంతేనా, కంకిపాడులోనే దిగారా తిన్నగా?''

''అఫ్‌కోర్స్, అంతకుముందు హైద్రాబాదులో దిగి టాక్సీలో వెళ్ళి పత్రికాఫీసులో ఆయన ఫ్రెండుని కలిసాం.... వెంటనే వచ్చేసామనుకో!''

ఇందువదన ఆలోచిస్తూ ఉండిపోయింది.

కంచాల్తో తాళభజన చేస్తూన్న పిల్లలిద్దరూ ఇహ తమకిప్పుడు తిండియోగ్యత లేదని తెలుసు కున్నట్టున్నారు. లేచ్చక్కా పోయారు.

పావుగంట గడిచింది. పేటలో ఉన్న ఎలిమెంటరీ స్కూలు పిల్లలు పాతికమంది హనుమంతుడి బొమ్మలూ, బుక్కా గొట్టాలూ పుచ్చుకొచ్చారు. ''శ్రీ పార్వతీపుత్ర - శృంగార గాత్ర; ''శ్రీ లక్ష్మి మీయింట హెచ్చుగా నిలచి; ''సిరిభార్యామణియై విరించి కొడుకై'' పద్యాల్ని పాడారు.

ఈ పిల్లల గోలకి దొడ్లో గొడ్లపాకవద్ద కూర్చుని రాసుకుంటూన్న అల్లుడు చిరాగ్గా లేచి చురుగ్గా వచ్చేసాడు. సరిగ్గా ఆ సమయానికి పిల్లలు '' వర్ధిల్లు నారాయణా, జయాభిజయీ భవ, దిగ్విజయీ భవ'' అంటూ ముగించారు. వాళ్ళల్లో ఒక సన్యాసి గట్టిగా ''నారాయణా!'' అని అరిచాడు. ఇంకొంచెం పెద్ద వాడెవడో, ''నారాయణ్ణారాయణ'' అన్నాడు కొంటెగా.

అల్లుడికి చిరాకు రెట్టింపయింది. అతనన్నాడు ''బాకాలొంచొచ్చినట్టు దొడ్లోకి వినిపిస్తోంది సొండు, ఇదేం గోలండీ మామయ్యగారూ!.... పండగపూట వాకిట్లో నారాయణ్ణారాయణేంటి, నాకీసొండు హింసేంటి!'' అన్నాడు.

జరరానలం చటుక్కున, ''ఒరే పిల్లలూ ఆపండ్రా. ఇదిగో ఇత్తీసుకుని పొండి!'' అంటూ ఓ పది తీసిచ్చాడు. వాళ్ళు కదిలారు. వెంటనే, ''సరేగాని అల్లుడూ, అదేదో రావాలన్నావుట...'' అంటూ వెనక్కి తిరిగాడు. అల్లుడు లేడు! అప్పటికే దొడ్లోకెళ్ళి పోయాడు. జరరానలం హతాశుడై కూలబడ్డాడు కుర్చీలో!

టైము చూసుకున్నాడు. పదిన్నర!

★ ★ ★

''ఏమోయ్ జరరానలం, అమ్మాయీ అల్లుడూ పండక్కి... !'' అంటూ లోపలి కొచ్చాడు జరరానలం మిత్రుడు జ్వాలాపతి. వచ్చి కుర్చీలో కూర్చుంటూ పక్కనే పడక్కుర్చీలో దిగాలుపడి కూర్చునున్న జరరానలాన్ని చేత్తో కదిపి, ''ఏంటీకథ, పండగ భోజనం ఇంకా అయినట్టులేదే!'' అన్నాడు.

''ఎట్లా అవుతుంది అది రాందే!'' అన్నాడు జరరానలం.

''అది రావాలా ఏది రావాలి?''

చిరాగ్గా అన్నాడు జరరానలం ''ఏమో ఎవడికి తెల్సు! ఆ దొడ్లో కూర్చునున్న మా అల్లుడు దొరగార్నడుగు! అరగంట క్రితమే వంటయిపోయింది. అమ్మాయెళ్ళి భోజనానికి రమ్మని పిలిస్తే, 'అది రాందే రాను' అన్నాట్ట.

''ఐసీ!... బహుశా పోస్టులో ఉత్తర మేదయినా రావాలేమో!... ఎవరో అనారోగ్యంగా ఉన్నట్టున్నారు, ఆ వివరమేదో తెలుసుకోవటం కోసం, పాపం, ఆదుర్దా పడుతున్నట్టున్నాడు''

''ఇవ్వాళ విజయదశమి. పోస్టుకు సెలవయ్యా బాబూ!''

''యస్, యస్! మరయితే ఏంటైవుంటుంది!... అది రావాలన్నాడా! అది అన్నాడా, అద్దె-

అన్నాడా? ఏమమ్మాయ్, కొట్లు, గిడ్డంగులు , గానుగలు, గుండిగలు, కనీసం గూళ్ళు అంటే ఇళ్ళులే - వగైరాలేవయినా మీరు అద్దె కిచ్చారా? ఆ అయివేజేమయినా రావాలా? అస్తున్న ఏ ముసలమ్మయినా టపా కట్టేస్తుందనే ఆశ ఉందా? ఆహ మీకు ఆదాయమొచ్చే మార్గముందేమోనని అడుగుతున్నా?"

గుమ్మంలో నుంచునున్న కలకంఠి అంది! " లేదండీ బాబాయిగారూ, అల్లాంటి ఆదాయాలేం లేవు "

" మరయితే ఏమయ్యుంటదబ్బా! అతనన్నది అద్దమనా! ఛ, ఛ అద్దం రావటమేంటి! కనక అద్దం కాదులే మరైతే కట్నం, కట్నమేమోనయ్యా కట్నమే మాత్రమైనా బకాయున్నావేంటయ్యా జఠరానలం!"

జఠరానలం చటుక్కున నొచ్చుకున్నాడు. " రామ, రామ! నేనిస్తానన్నదే అతగాడు పుచ్చుకోనని తిరగ్గొట్టాడే, మరిహ నేను బాకీ ఉంటమేంటి? . ఏమాట కామాటే చెప్పుకోవాలి, ఈ విషయంలో మాత్రం మా అల్లుడు మహ యోగ్యుడు, మా వియ్యంకుడు మాత్రం ఆయన తూర్పు, కట్నం కానుకలూ వగైరాలు పడమరాను డబ్బుదగ్గర పేచీల్లేవు. సరిగదా, పట్టింపుల్లేవు, భ్రమలే లేవు!"

జ్వాలాపతి అన్నాడు " ముంచి ముక్కే చెప్పావు. . అర్ధరాత్రి అందరూ అంత పరిపూర్ణంగా ఉత్తములైతే ఈ లిటిగేషనేంటయ్యా! అది రావటం పంతమేంటంట!" జ్వాలాపతి లేచాడు, అటూ ఇటూ తీక్షణంగా పచార్లు చేసాడు. హఠాత్తుగా అన్నాడు "ఊఁ, వచ్చేసిందయ్యా అయిడియా వచ్చేసింది. అది అంటే ఊపయ్యా ఊపు! భోజనం చెయ్యాలంటే మరి అల్లుడికి ఊపు రావాలేమో! అంటే అచ్చ తెనుగులో పూనకమన్నమాట! . అమ్మాయ్, భోజనానికి ముందు మీ ఆయన గంగానమ్మ, పోలేరమ్మా, బతకమ్మ అంకాలమ్మ, నూకాలమ్మ, గావుల శక్తమ్మ వగైరా దేవత నెవర్నయినా పూజ చేస్తుంటాడా?"

కలకంఠి బాధగా అంది. " మావారికి ఊపులే లేవు. పూనకాలూ లేవు, అసలట్టాంటి చిల్లర పూజలంటే మా వారికి ఒళ్ళుమంట కూడాను!"

జ్వాలావతి మళ్ళీ సాలోచనగా పచార్లు చేసాడు చేసి, చేసి, మొహం వెలిగిపోగా, ఆ వెంటనే మళ్ళీ దిగులు పులుముకోగా, ఆగి, విచారంగా అన్నాడు. " అఁతేలిపోయింది. అది అదేనమ్మా!... లాభం లేదు ... అదిహ మీ అయన్ని పూర్తిగా వల్లో వేసేసుకుంది. పసిదానివి పాపం!...గట్టిగా ఆర్నెల్లయినా కాపరం చేసావో లేదో బండి గాడి తప్పి లూప్ లైన్లో పడింది. మీ అయన ఏదో సైడ్ డిష్‌ని మరిగాడు. ప్చ్ , ఏం చెయ్యగలం పాపం! ... అనుభవించిందే దక్కుడనుకో!... సరే, మీ అదితో కూర్చుంటే అవతల మా అది ఊరుకోదు. మరి... వస్తానూ!.. " జ్వాలాపతి వెళ్ళిపోయాడు. కలకంఠి కంగారు పడింది. భయం భయంగా తండ్రివైపు చూసింది.

జఠరానలం గుడ్లురిమి చూశాడు " వెళ్ళు, మళ్ళీ కనుక్కురా పో!" అని గద్దించాడు.

కలకంఠి దొడ్లో కెళ్లింది వచ్చింది. తండ్రితో అంది " వెళ్ళి భోజనానికి రమ్మన్నాన్నాన్నా. 'ఇందాకనే చెప్పానుగా, అది రాందే భోంచెయ్యనని, అది నా పక్క నుంటేనే గాని నాకు ముద్ద దిగదు' అన్నారు.' అది రావటం మీద మీ కంత పంత మేమిటండీ?- అనడిగాను నేను ఇప్పుడే భోజనానికి రావాలీ- అని మీ కంత పట్టింపేంటి? . కావాలంటే మీరంతా భోంచేసెయ్యండి ' అన్నారు. ' ఇంతకీ అదంటే ఏంటండీ' అని కూడా అడిగేసాను సాహసించి ఆయన " ఏదో ఒహటి, నా నాపక్కనుండి నన్నుత్సాహపరిచేది, ఫో!" అనివిసుక్కున్నారు "

జఠరానలం దీర్ఘంగా నిట్టూర్చాడు దిగులుగా కుర్చీలో వెనక్కి చేరగిలబడ్డాడు. అన్నాడు "అది అంటే ఉత్సాహపరిచేది అన్న అర్థం ఉందా? ఏమో ఏంపాడో?" అంటూ చటుక్కున లేచి, " వెధవ

గోల! కాస్సేపు లెక్చరరుగారింటికైనా వెళ్ళొస్తాను. అమ్మాయ్, నీ దేవుడు ఆ గుళ్ళోంచి అవతలకి రాగానే కబురు ముక్కొహటి తెచ్చి నా మొహాన పారేయ్.' అంటూ పై కండువా, చెప్పులూ వేసుకొని బయల్దేరాడు.

★ ★ ★

పండుగ భోజనం చేసి తాంబూలం వేసుకుంటున్న తెలుగు లెక్చరర్ భాషా కేసరి, జరరానలాన్ని సాదరంగా ఆహ్వానించాడు. కుశలప్రశ్న లయ్యాక జరరానలం యాథాలాపంగా తన అల్లుడు అదిరాందే భోజనానికి రానని పంతం పట్టాడని చెప్పి, అదంటే ఏంటని అడిగాడు.

భాషాకేసరి ఇహ అందుకున్నాడు " అది అనేది మహత్తరమైన మాట ! అదికి చాలా అర్థాలున్నాడి అది అనేది అంతకు ముందు చెప్పబడిందాన్ని సూచిస్తుంది. ఈ ఉదాహరణ వినండి : ' పలుకు సుత్తెప్పుడూ సిద్ధంగా ఉంచుకునే నీకు ఇనుప సుత్తితో పనేమిటే ఇందువదనా! అన్ని ఆయుధాల్నీ దిగదుడుపు చేస్తుంది కదా అది'- ఇక్కడ అది అంటే ముందు చెప్పబడిన పలుకు సుత్తన్న మాట...'

జటరానలం చటుక్కున ముందుకు వంగి కూర్చున్నాడు.

" ఏం, ఇంక ప్రస్తుతం దేన్నుద్దేశించి మాట్లాడుత్నామో దాన్ని తెలియజేస్తూ అది. ఉదాహరణకి- కోతికొమ్మచ్చు లాడటం, బిడెగ్గొట్టి ఈతలు కొట్టటం, కలేబడి బూతులు తిట్టటంఇట్లా అదే అదే మళ్ళీ వద్దన్నా చేస్తూండటం చంటివాళ్ళ లక్షణం - ఇక్కడ అది అనేదాని అర్థం తెలుస్తూనే వుంది గదా?"

జరరానలం కళ్ళు ఎరుపు జీరల్ని సంతరించుకున్నాయి. నిటారుగా ఇంకొంచెం బిగుసుకుపోయి కూర్చున్నాడు కుర్చీలో.

" అయ్యా, అది అనేది ఎదుటలేని దాన్ని కూడా తెలియజేస్తుందనటానికి ఈ ఉదాహరణని చిత్తగించండి. పో పొమ్మన్నప్పటికీ వస్తూండటం, రా రమ్మన్నప్పుడు నాకు అది కావాలి, ఇది రావాలి.- అంటూడటం దశమగ్రహం అనే బిరుదుగల అల్లుడి లక్షణం. - ఇక్కడ అది అనేది ఎదుటలేని దేన్నయినా తెలియజేస్తోంది గదాండి! ఇహపోతే, 'అద్ది!' అని అంగీకారాన్ని తెలపటానికే, 'అదీ!' అని ఆశ్చర్యాన్ని ప్రకటించటానికీ, 'అదా?' అన్న ప్రశ్న వెయ్యటానకీ, అట్లా అనేక రకాల అర్థాల్లో 'అది' ని వాడతారు. అసలిది దేశ్యపదమున్నూ, ప్రథమా ఏకవచనమున్నూ. ఈ అది అనేది మహదర్థకం, మహదర్థకం అంటే...."

" నా శ్రాద్ధం!" - జరరానలం దిగ్గున లేచాడు. కోపంగా. " ఉదాహరణల పేరుతో కించపరచటానికి నా కుటుంబం తప్ప ఇంకెవరూ దొరకలేదా మీకు మాస్టారూ! నాభార్య ఇందువదన్నీ, మా చంటాడ్నీ, చివరికి మా అల్లుణ్ణి కూడా ఆకతాయిల కింద జమకట్టి, ఇన్సల్ట్ చేసారే. మీ కసలు నోరెల్లా వచ్చిందండీ!... చాల్చాలెెండి. రాక రాక వచ్చినందుకు మహబాగా బుద్ధి చెప్పారు ! హుఁ!"

జరరానలం ఇంటికొచ్చాక , ఇందువదన అంది , " అన్నాడూ నేననుకుంటూనే ఉన్నా!... ఇందాకనే చెప్పాడు ఆ జ్వాలాపతిగారు, ఇదేదో గొంతు తిరుగుడు వ్యవహారమని, ఎంతనుభవం లేకపోతే చెబుతాడు? .. అమ్మాయ్, ఇహ లాభం లేదే, ఇది మామూలు విషయం కాదు. ఆయన్ని తుప్పతల దెవత్తో పట్టుకుంది. ఇట్టాంటప్పుడు డైరీలు రహస్యాలు చెప్పేస్తాయి. వెళ్ళి మీ ఆయన డైరీ ఏమన్నా ఉంటే పట్టుకురా!"

కలవర పడుతూ కలకంఠి గదిలో కెళ్ళింది డైరీ తో తిరిగొచ్చింది. తల్లీ కూతుళ్ళిద్దరూ దాంట్లో వెతగ్గా వెతగ్గా ' ప్రియ అఫీస్, ఫోన్ 25985' అన్న అడ్రస్ దొరికింది

" ఈ ప్రియ ఎవత్తే? నీకు తెలుసా?"- అడిగింది ఇందువదన

ఆలోచించింది కలకంఠి. చటుక్కున అంది " అవునేవ్, హైద్రాబాదులో ఆ ఆఫీసులో గదిమీద ప్రియ ఆఫీస్ అని రాసుందే. నేను బయట వాటర్ కూలర్ దగ్గర నీళ్ళు తాగుతూ ఉండిపోయాను. అయనేమో ఆగదిలోకెళ్ళి ఎవరో అమ్మాయితో మాట్లాడారే పకపకలూ వెకవెకలూను! నేను కూడా లోపలి కెళ్ళాలని నా కప్పుడు తట్టలేదు స్మీ !"

ఇందువదన గాబరాగా అంది. " కొంప ముంచావే నాతల్లీ! ఆ మాయలమారి టక్కుటమారం దాని పేరేనే అమ్మ ఆ ప్రియ! అది రావటం కోసమే ఇప్పుడిక్కడ ఎదురు చూస్తున్నాడే మీ ఆయన! నీ బతుకు బండలయిపోయిందే! నీ కాపురం కాట్లో కలిసిందే! కొంగు తగిలించి వల్లో వేసుకోనుంటుంది ఏబ్రాసి ముండ!... " నాలుగు క్షణాలాగి గద్గద స్వరంలో మళ్ళీ అంది. " నా ఒక్కగానొక్క కూతురు కాపురం చట్టుబండలయిపోయింది. నేనేం చెయ్యను. నా కూతురుకు దిక్కేంటి?.."

కలకంఠి బెంబేలు పడిపోయింది. తల్లి నానుకుని కావలించుకొని కూర్చుంది. " నిజంగా ఆయన దేన్నయినా మరిగారంటావా?" అంది.

" ఇంకా అనుమానమేంటే చిట్టితల్లి ? ఇందాకన చూళ్ళా, రోడ్డుమీద ఎవత్తెకో వెనకాల పడ్డాడు... ఎంతో బుద్ధిమంతుడని నిన్ను కట్టబెట్టామే నాతల్లీ ! ఇంత తొందరగా నీ బతుకు బుగ్గయి పోతుందనుకోలేదే మాయమ్మా! ఇంకెట్లాగే నీగతి!"

తల్లి కూతుళ్ళిద్దరూ నోట్లో కొంగు కుక్కుకుంటూ సన్నాయి నొక్కుడు ఏడుపు మొదలెట్టారు!

పక్కింటి వాళ్ళ కుర్రాడు చేతిలో ఏదో పుస్తకంతో సర్రున దూసుకొచ్చి దొడ్లో కెళ్ళిపోయాడు. కాస్సేపటికి అల్లుడు చింకి చాటంత మొహంతో ఆనందంగా ఈవలికొచ్చాడు." మీరెవ్వరూ భోంచేసినట్టు లేదు. చేద్దాం రండి మావయ్యగారూ!" అన్నాడు.

తల్లీ కూతుళ్ళ వైపు చూసి, " ఎవరు పోయింది? టెలిగ్రామా?" అన్నాడు. ... తల్లీ కూతుళ్ళిద్దరూ నోట్లోంచి కొంగులు తీసేసారు.

జటరానలం, " అదేదో రావాలని పంతం పట్టావుగా నాయనా, వచ్చిందా?" అన్నాడు.

అల్లుడు తికమకగా చూసాడు. ఫకాల్మనవ్వాడు. అన్నాడు. " ఒహో, అదా! ఇదిగో అది ఇది! మాసపత్రిక! నా మొట్ట మొదటి రచన. చిన్న జోక్ లెండి- అచ్చయిన పత్రిక ! ఇప్పుడే పదకొండు గంటల బస్సులో వచ్చిందిట... ఊఁ... ఆకలిగా ఉంది. వెళ్దామా?"

గురగుర గొంతుతో తల్లిచాటునించి కలకంఠి అంది! " మరి... ప్రియ ఆఫీస్ అంటే... ప్రియ అంటే ... ఎవరు?"... " ప్రియ ఆఫీసంటే సాహిత్య ప్రియ ఆఫీసే?"... "మరి... ఆ ఆఫీసులో... మీతో మాట్లాయిన... ఆ అమ్మాయి?"

" అదా! అది అమ్మాయి కాదు. అబ్బాయే! అక్కడి సబ్- ఎడిటర్. ఆడగొంతుతో మాట్లాడి వినిపించాడు. కాస్సేపు నవ్వుకున్నాం... ఏవండీ అత్తయ్యగారూ, మీ ఇంట్లో ఇంత పట్టింపేంటండీ? పండగ పూటా మీకూ ఆలస్యం భోజనమే అయింది గదా!.. ప్చ్!"

గుడ్లురిమి కోపంగా చూస్తూ జరరానలమూ, కొంగు విసిరి బొడ్లో దోపుకుంటూ ఇందువదనా, తలొంచుకుని పిల్లిలా ఆ వెనకాలే కలకంఠి, " ఇదిగో నా జోక్ చూడవా" అంటూ పుస్తకంలో ఆ వెనకాలే అల్లుడూ - అంతా వంటింట్లోకి నడిచారు!

(హాస్యప్రియ జనవరి 1986)

*** *** ***